వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న

బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం దంపతులు

నస్రుల్లాబాద్, మార్చి 14 : బీర్కూర్ మండలం తిమ్మాపూర్‌లోని తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో గురువారం శ్రీవారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఆలయ ధర్మకర్త, మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, సతీమణి పుష్ప పాల్గొన్నారు. మొదటి రోజు లక్ష్మీగోదా సమేత వేంకటేశ్వర స్వామి నవమ వార్షిక బ్రహ్మోత్సవాల అంకురార్పణ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పరిగె శంభురెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, నర్సరాజు, అప్పారావు పాల్గొన్నారు.

అమ్మదయ ఉంటే అన్ని ఉన్నట్లే..

బాన్సువాడ టౌన్, మార్చి 14 : అమ్మదయ ఉంటే అన్ని ఉన్నట్లేనని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. పట్టణంలోని కోటగల్లీ కోటదుర్గమ్మ ఆలయం మొదటి వార్షికోత్సవంలో పోచారం శ్రీనివాసరెడ్డి సతీమణి పుష్పమ్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోచారం మాట్లాడుతూ.. కోటదుర్గమ్మ ఆలయ నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు అందించామని తెలిపారు. ఎమ్మెల్యే దంపతులను ఆలయ కమిటీ తరపున సన్మానించి అమ్మవారి ఫొటోను అందజేశారు. బీర్కూర్ మండలం తిమ్మాపూర్ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో 19వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఎమ్మెల్యే పోచారం కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ అంజిరెడ్డి, మండల నాయకులు ఎజాస్, దొడ్ల వెంకట్‌రాంరెడ్డి, వాహబ్, గోపాల్‌రెడ్డి, శ్రీధర్, నర్సింహు లు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ జుబేర్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి

నూతన భవన నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి కాంట్రాక్టర్‌కు సూచించారు. బాన్సువాడ పోలీస్‌లైన్ బాలికల ఉన్నత పాఠశాలను ఎమ్మెల్యే పోచారం, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. భవన నిర్మాణ పనులను చూసి కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిపోయిన పనులను వెంటనే పూర్తి చేసి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కావాల్సిన నిధులను కేటాయించినా పనులు పూర్తి చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు.

బోనాలతో ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం దంపతులు

నీటి సంరక్షణ పనులు చేపట్టాలి

■ కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మార్చి 14 : ఉపాధి హామీ పథకంలో నీటి సంరక్షణ పనులు చేపట్టాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఉపాధి హామీ పథకంపై మండలస్థాయి అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు కలెక్టర్ హాజరై మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీలో భాగంగా నీటి నిల్వ కుంటలు (రీఛార్జ్ ఫీట్లు) పర్కులేషన్ ట్యాంకులు, కంటూర్ కందకాలను కూలీలతో తవ్వించి భూగర్భ జలాల పెంపునకు దోహదపడాలని తెలిపారు. ఉపాధి హామీ పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో హాజరయ్యేలా మండల స్థాయి అధికారులు చూడాలని సూచించారు. గ్రామాల్లో చేపట్టాల్సిన పనులను గుర్తించి జాబ్‌కార్డు ఉన్న కూలీలకు పనులు కల్పించాలని చెప్పారు. చెరువుల్లో పూడిక మట్టి తొలగించే కార్యక్రమాన్ని చేపట్టాలని, పూడిక తీసిన మట్టిని రైతుల పంట పొలాలకు పంపించాలని సూచించారు. గ్రామాల్లో సాగునీటి కాలువల్లో కూలీలతో పూడిక తీయించాలని తెలిపారు. కూలీలకు ఉపాధితో పాటు రైతుల పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందే వీలుంటుందని చెప్పారు. మండలాల వారీగా ఉపాధి హామీలో చేపట్టిన పనులు, వస్తున్న కూలీల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో చందర్ నాయక్, ఏపీవోలు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

నియోజకవర్గంలో అక్రమ లే అవుట్లు ఉండకూడదు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

■ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, మార్చి 14 : నియోజకవర్గంలో అక్రమ లేఅవుట్లు ఉండకూడదని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశాన్ని గురువారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇప్పటి వరకు అనుమతి ఇచ్చిన లే అవుట్లల్లో ఏమైనా లోపాలు ఉంటే వెంటనే సవరించాలని సూచించారు. మిషన్ భగీరథ నీళ్లు పట్టణంతోపాటు ప్రతి గ్రామంలో క్రమం తప్పకుండా వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ అధికారులతో యాసంగి పంటకు కరెంటు ఇబ్బందులు ఉండొద్దని అన్నారు. మున్సిపల్ అధికారులు నూతనంగా నిర్మించే భవనాలకు నిబంధనలకు లోబడి ఉంటేనే అనుమతులు ఇవ్వాలని, ఎలాంటి తప్పిదాలు జరిగినా అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని చెప్పారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఒకరి గల్లంతు

బాన్సువాడ రూరల్, మార్చి 14 : నిజాంసాగర్ ప్రధాన కాలువలో ఒకరు ప్రమాదశాత్తు పడి గల్లంతైనట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. నీటి పారుదలశాఖలో లస్కర్‌గా విధులు నిర్వహిస్తున్న రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామానికి చెందిన మొగ్గం నర్సయ్య(48) గురువారం కాలువలో పడి గల్లంతు అయ్యాడు. బాన్సువాడ మండలంలోని జక్కల్‌దాని తండా సమీపంలో నిజాసాంగర్ ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటర్ 14 వద్ద ప్రమాదం జరిగినట్లు తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం చేతుల కడుక్కునేందుకు ప్రధాన కాలువ అంచునకు దిగగా, ప్రమాదశాత్తు కాలుజారి కాలువలోపడి గల్లంతైనట్లు తెలిపారు. ఇటీవలే బాన్సువాడ సబ్ డివిజన్ నీటిపారుదలశాఖలో లస్కర్‌గా విధుల్లో చేరినట్లు సంబంధితశాఖ అధికారులు తెలిపారు. కాలువలో గల్లంతైన విషయం తెలుసుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ప్రధాన కాలువ నీటి సరఫరాను నిలిపివేశారు.

గ్రూప్-4 ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులకు సన్మానం

భిక్కనూరు, మార్చి 14 : మండలంలోని తిప్పాపూర్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి గ్రూప్-4 ఉద్యోగాలు సాధించారు. వీరిని తిప్పాపూర్ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు వారిని సత్కరించారు. అధ్యక్షుడు లింగారెడ్డి, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు సాయిరెడ్డి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లా పోలీసు స్పోర్ట్స్ మీట్

కామారెడ్డి, మార్చి 14 : జిల్లా కేంద్రంలోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో జిల్లా పోలీస్ స్పోర్ట్స్ మీట్ గురువారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ సింధూశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని క్రీడల్లో హోంగార్డు ఆఫీసర్ నుంచి అధికారుల వరకు మంచి క్రీడాస్ఫూర్తిని కనబరిచారని అన్నారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీలు నాగేశ్వర్‌రావు, శ్రీనివాసులు, సత్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, పోలీసులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్పీ సింధూశర్మ

పన్నుల వసూలుపై దృష్టి సారించాలి

భిక్కనూరు, మార్చి 14 : ఇంటి పన్నుల వసులపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. భిక్కనూరులో పంచాయతీ కార్యదర్శులతో గురువారం సమావేశం నిర్వహించారు. పంచాయతీ అభివృద్ధి పనుల ప్రణాళిక, అన్ని శాఖల ప్రగతి నివేదిక తీయారు చేయాలన్నారు. ఎంపీడీవో సంతోష్‌రెడ్డి, ఎంపీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పన్ను వసూలుకు ప్రత్యేక డ్రైవ్

బాన్సువాడ రూరల్, మార్చి 14 : బాన్సువాడ మండలం తాడ్కోల్ లో పంచాయతీ కార్యదర్శులు గురువారం ఇంటింటికీ తిరుగుతూ పన్నులను వసూలు చేశారు. పంచాయతీ కార్యదర్శులు ప్రశాంతి, రహేలాబేగం, నీలిమా పాల్గొన్నారు.

లక్కీడ్రాలో ముగ్గురు విద్యార్థులు ఎంపిక

కామారెడ్డి, మార్చి 14 : కామారెడ్డి జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ సమక్షంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ 1వ తరగతి ప్రవేశాలకు సంబంధించిన లక్కీడ్రా గురువారం నిర్వహించారు. ముగ్గురు బాలికలను పాల్వ్య నందిని, కారంతోడ్ వరుణ్, దేవ సోత్ రుత్విక్ లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేశారు. ఇన్‌చార్జి గిరిజన అభివృద్ధి అధికారిణి రజిత, అధికారులు, ఇద్దరు ప్రధానోపాధ్యాయులు సాయిరెడ్డి, లక్ష్మీనారాయణ, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కామారెడ్డి అదనపు కలెక్టర్‌గా శ్రీనివాస్ రెడ్డి

కామారెడ్డి, మార్చి 14: కామారెడ్డి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా డి.శ్రీనివాస్‌రెడ్డి నియామకమయ్యారు. రాష్ట్రంలో పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలో భాగంగా కొంతకాలంగా వెయింటింగ్‌లో ఉన్న ఎస్‌జీడీసీ డి.శ్రీనివాస్ రెడ్డిని కామారెడ్డి అదనపు కలెక్టర్‌గా నియమించగా.. గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ జితేశ్ వీ పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రూ. 20 లక్షల అల్ఫాజోలం పట్టివేత

వినాయక్‌నగర్, మార్చి 14 : కల్తీ కల్లు తయారీకి వినియోగించే అల్ఫ్రాజోలాన్ని కారులో తరలిస్తుండగా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ దాడి చేసి పట్టుకున్నది. నిజామాబాద్ డివిజన్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆదేశాల మేరకు కామారెడ్డి పట్టణంలోని ఇంటర్నేషనల్ హోటల్ వద్ద అధికారులు కారును తనిఖీ చేశారు. రాజస్థాన్ రాష్ట్రంలోని నాగౌర్ జిల్లా లాడ్ను గ్రామానికి చెందిన భవానీసింగ్ వద్ద రూ. 20 లక్షల విలువ చేసే రెండు కిలోల అల్ఫాజోలం లభించినట్లు అధికారులు తెలిపారు. రాజస్థాన్‌లో ముఖేశ్‌సింగ్ వద్ద కొనుగోలు చేసి హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన సుదర్శన్‌కు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీ సమయంలో సుదర్శన్ అనే వ్యక్తి కారును వదిలేసి అక్కడి నుంచి పరారైనట్లు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకొని కామారెడ్డి ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. దాడిలో నిజామాబాద్ ప్రొహిబిషన్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ చంద్రభాను నాయక్, ఇన్‌స్పెక్టర్లు స్వప్న, వెంకటేశ్, ఎస్సైలు విక్రం కుమార్, నర్సింహాచారి పాటు సిబ్బంది రాజన్న, హమీద్, ఉత్తమ్, శివ, విష్ణు, అవినాష్, గంగారాం, లక్ష్మన్ పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం

దోమకొండ, మార్చి 14: బీడీ కంపెనీల్లో పనిచేసే కార్మికులకు కరువు భత్యం పెరిగినట్లు తెలంగాణ రాష్ట్ర నూతన బీడీ కార్మికుల సంఘం రాష్ట్ర కార్యదర్శి శివంది సత్యం తెలిపారు. ఈ సందర్భంగా గురువారం బీడీ కార్మికులతో కలిసి మాట్లాడారు. ఏప్రిల్ నుంచి పెరిగిన కరువు భత్యం అమలులోకి వస్తుందని తెలిపారు. కార్మికులు గమనించి పెరిగిన కరువు భత్యం పొందాలని, ఇవ్వని యెడల యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే హసన్, రాజేందర్, సిద్ధరాములు, బీడీ కార్మికులు పాల్గొన్నారు.

బోర్లం క్యాంపులో వైద్య శిబిరం

బాన్సువాడ రూరల్, మార్చి 14 : మండలంలోని బోర్లం క్యాంపులో రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 55 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఉచితంగా ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. చికిత్స కోసం వచ్చిన వారికి ఉచితంగా రక్త పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులను అందజేశారు. వైద్య శిబిరంలో వైద్యుడు విక్రం, ఏఎన్ఎం గంగమణి, పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ, కారోబార్ వినయ్‌కుమార్, ఆశవర్కర్లు పద్మ, వరలక్ష్మి, సుచిత్ర పాల్గొన్నారు.

పరీక్షలు జీవితంలో ఒక భాగం మాత్రమే..

మాట్లాడుతున్న ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్

చిన్నకొడప్‌గల్‌లో పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 14: పరీక్షలే జీవితం కాదని, అవి ఒక భాగం మాత్రమేనని ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్ విద్యార్థినులతో అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్(బాలికల)లో ఆయన సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది, మూడు మండలాల ఎంఈవోలతో కలిసి విద్యార్థినులకు పరీక్ష అట్టలను గురువారం పంపిణీ చేశారు. పరీక్ష లంటే భయపడవద్దని, ధైర్యంగా రాయాలన్నారు. మంచిగా చదువుకొని సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని సూచించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 405మంది విద్యార్థులకు పరీక్షా ప్యాడ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి, లింగంపేట, ఎస్సైలు బొజ్జ మహేశ్, చైతన్యారెడ్డి, ఎల్లారెడ్డి, లింగంపేట ఎంఈవోలు వెంకటేశం, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

పలు పాఠశాలల్లో పాఠశాలల్లో పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ..

సదాశివనగర్/పిట్లం, మార్చి 14: మండలంలోని మర్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి వి.బాల్‌రెడ్డి(లెక్చరర్, ఎస్ఆర్‌కే కాలేజీ), పద్మాజివాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు పద్మాజివాడి ఎక్స్ రోడ్డులోని శ్రీ క్రిష్ణ దవాఖాన యాజమాన్యం ఆధ్వర్యంలో డాక్టర్ వరుణ్ కుమార్, పిట్లం మండలం చిన్నకొడప్‌గల్ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు లయన్స్‌క్లబ్ పిట్లం శాఖ ఆధ్వర్యంలో గురువారం పరీక్షా సామగ్రిని పంపిణీ చేశారు. మర్కల్‌లో హెచ్ఎం కిరణ్ ప్రసాద్, ఎస్ఆర్‌కె డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దత్తాద్రి రావు, జూకంటి తిరుపతి రెడ్డి, సుభాష్ రెడ్డి, ప్రవీణ్, పద్మాజివాడి పాఠశాలలో విష్ణువర్ధన్ రెడ్డి, ప్రదీప్ కుమార్, సురేశ్ కుమార్, మోహన్ రావు, చిన్న కొడప్‌గల్‌లో లయన్స్ క్లబ్ పిట్లం శాఖ అధ్యక్షుడు కిషన్, సభ్యులు కాశీరెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు కిష్టయ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం : ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

సర్టిఫికెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

పిట్లం, మార్చి 14: రక్తదానం మహాదానమని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మండలకేంద్రంలో రెడ్‌క్రాస్ సొసైటీ, పీఆర్టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రక్తదానం చేసిన వారు ఆరోగ్యవంతులుగా ఉంటారన్నారు. రక్తం ఇతరులకు అత్యవసర సమయంలో ఉపయోగపడుతుందని తెలిపారు. రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సంజీవరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు వేణుగోపాల్, మండల అధ్యక్షుడు బుడాల నవీన్, పీఆర్టీయూ మండల శాఖ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి చాలా విలువైనది..

ఉపాధ్యాయ వృత్తి చాలా విలువైనదని ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. పిట్లంలోని ఓ ప్రైవేటు గార్డెన్‌లో గురువారం నిర్వహించిన ఉపాధ్యాయుడు గణేశ్‌రావు ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గణేశ్‌రావుకు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మారెడ్డి, పీఆర్టీయూ మండల శాఖ బాధ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి పరిశీలన

నిజాంసాగర్, మార్చి14: మండలంలోని బంజపల్లి గ్రామ శివారులో రైతులు సాగుచేస్తున్న వరిని ఏఈవో స్వర్ణలత, వొడ్డెపల్లి గ్రామ శివారులో ఏఈవో రేణుక గురువారం పరిశీలించారు. వరికి ప్రస్తుతం తెల్లకంకి సోకిందని, దీని నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ మందును ఎకరాకు 400 గ్రాముల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. గ్రామ కో-ఆర్డినేటర్ కృష్ణమూర్తి, లింగాగౌడ్, రాజు, దశరథ్, అంజయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఫిజియోథెరపీ

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 14: మండల కేంద్రంలోని భవిత భవనంలో గురువారం దివ్యాంగ చిన్నారులకు ఫిజియోథెరపీ నిర్వహించారు. డాక్టర్ అరుణ్ ఎనిమిది మంది దివ్యాంగులతో వ్యాయామం చేయించారు. ఐఈఆర్పీ వెంకటేశం పాల్గొన్నారు.

నేటి నుంచి టీకాల పంపిణీ

డోంగ్లీ, మార్చి 14: ప్రభుత్వ ఆదేశాల మేరకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నేటి(శుక్రవారం) నుంచి మండలంలోని పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్లు పశువైద్యాధికారి వినిత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ధోతి గ్రామం నుంచి టీకాల పంపిణీ కార్యక్రమం ప్రారంభిస్తామని పేర్కొన్నారు. పశువులు ఉన్న రైతులందరూ తప్పకుండా టీకాలు వేయించాలని ఆయన సూచించారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం

లైట్లను ప్రారంభిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 14: మండలంలోని కొట్టాల్, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఏర్పాటుచేసిన హైమాస్ట్ లైట్లను మాజీ సర్పంచ్ రవీందర్‌గౌడ్ గురువారం ప్రారంభించారు. ఎంపీ నిధులు రూ.రెండు లక్షల వ్యయంతో రెండు గ్రామాల్లో హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ అన్నీవసూరాం, మాజీ పాలక వర్గ సభ్యుడు బాలకృష్ణ, పీఏసీసీఎస్ డైరెక్టర్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు..

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 14: మండలంలోని తిమ్మారెడ్డి కట్టకింది తండాలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు సీసీ రోడ్డు కోసం రూ.ఐదు లక్షల నిధులను మంజూరు చేయడంతో తండావాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు చెన్న లక్ష్మణ్, వసంత్, గోపాల్‌నాయక్, కిరణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ హిమబిందుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలి

నిజాంసాగర్, మార్చి 14: జుక్కల్ మండలంలో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తహసీల్దార్ హిమబిందుకు రైతులు గురువారం వినతి పత్రం అందజేశారు. జుక్కల్ మండలంలో సుమారు వెయ్యి ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటను సాగు చేశామని తెలిపారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి తమకు అదనపు భారాన్ని తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో రైతుల తోపాటు నాయకులు ప్రశాంత్‌పటేల్, పవన్, మారుతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

అంజనిలో బోరు డ్రిల్లింగ్

పెద్దకొడప్‌గల్, మార్చి 14: మండలంలోని అంజని గ్రామంలో బోరు డ్రిల్లింగ్ పనులను కాంగ్రెస్ నాయకులు గురువారం ప్రారంభించారు. ఎస్‌డీఎఫ్ ద్వారా మంజూరైన రూ.లక్షా50 వేలతో బోరు మోటరు ఏర్పాటు చేయిస్తున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి తెలిపారు. నాయకులు నాందేవ్ పటేల్, సాయాగౌడ్, అంజాగౌడ్, నాందేవ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం తైబజార్ వేలం

పిట్లం, మార్చి 14: మండలకేంద్రంలోని గ్రామ పంచాయతీ తైబజార్‌కు గురువారం పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి యాదగిరి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. పశువులదాక రూ.4.76 లక్షలు, మేకల సంత రూ.7.35 లక్షలకు వేలంలో దక్కించుకున్నారు. వారాంతపు సంతకు సరైన ధర రాకపోవడంతో వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారి, ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో బ్రహ్మం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రేపు నిజాంసాగర్ తైబజార్‌కు..

నిజాంసాగర్, మార్చి 14: నిజాంసాగర్ గ్రామ పంచాయతీ తై బజార్ వేలాన్ని ఈనెల 16న నిర్వహించనున్నట్లు కార్యదర్శి గంగారాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.25వేల డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలో మూడు ఎస్సెస్సీ పరీక్షా కేంద్రాలు

ఎల్లారెడ్డి రూరల్, మార్చి 14: పట్టణంలో మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఎస్సెస్సీ పరీక్షల కోసం మూడు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో వెంకటేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేయగా.. మొత్తం 732మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని పేర్కొన్నారు. 36 మంది ఉపాధ్యాయులు ఇన్విజిలేషన్ విధులను నిర్వహిస్తారని తెలిపారు. విద్యార్థులు కేంద్రానికి పరీక్షా సమయానికి అరగంట ముందుగానే చేరుకోవాలని సూచించారు.

విద్యార్థులకు బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలు

రక్తాన్ని సేకరిస్తున్న వైద్య సిబ్బంది

సదాశివనగర్, మార్చి 14: కామారెడ్డి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అడ్లూర్ ఎల్లారెడ్డి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం బ్లడ్ గ్రూప్ నిర్ధారణ పరీక్షలను నిర్వహించారని హెచ్ఎం నర్సింహారావు తెలిపారు. మొత్తం 200 మంది విద్యార్థుల రక్త నమూనాలు సేకరించి, బ్లడ్ గ్రూపు తెలియజేశారని చెప్పారు. అడ్లూర్ ఎల్లారెడ్డి విండో చైర్మన్ మర్రి సదాశివారెడ్డి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు సత్యం, కోశాధికారి తోరణాల సుధాకర్, సభ్యుడు హరికృష్ణ, మాజీ ఉప సర్పంచ్ చింతల లక్ష్మీపతి, వెంకట రమణ, జైపాల్ రెడ్డి, దత్తాద్రి, మాజీ వార్డు సభ్యుడు మొసర్ల శ్రీకాంత్ రెడ్డి, ఉపాధ్యాయులు జంగం వీర మహేందర్, వెంకటేశం, నగేశ్, లక్ష్మీనారయణ, ఖలీల్, జ్యోతి, రాములు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

కామారెడ్డి/ ఎల్లారెడ్డి, మార్చి 14 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ముగిశాయి. కెమిస్ట్రి, కామర్స్ పరీక్షలను ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జిల్లావ్యాప్తంగా మొత్తం 37 సెంటర్లలో నిర్వహించారు. మొత్తం జనరల్ 7,252 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 7,042 మంది హాజరయ్య